
# సమిష్టిగా కృషి సాగిద్దాం



యామినీ సరస్వతి

విద్యార్థి జీవితం ఒక రంగులలోకం.

అందులో బృందావనాలూ ఇంద్రధనస్సులూ, కల్పవృక్షాలూ, కామధేనువులు మాత్రమే వుంటాయి. ఊహాలోకాల్లో నృత్యం చేసే రంభా, ఊర్వశీ, మేనకలే కనిపిస్తూ వుంటారు. ప్రతి యువతీ జయంతిగానో, వాసంతిగానో, ప్రతి యువకుడూ కంతుడో, జయంతుడో, వసంతుడో అన్నట్టుగానో దర్శనమిస్తుంటారు. బరువూ బాధ్యతలేని, ఎరుగని అందమైన సుందరలోకం వాళ్లది.

శ్రీధర్ న్యాయశాస్త్రంలో పట్టా పుచ్చుకుని పుట్టినవూరు చేరేసరికి అమరావతికి జయజయధ్వానాల మధ్య తిరిగి వచ్చిన జయంతుడికి లభించినంత సత్కారం లభించింది. శ్రీధర్ నాన్నగారు సుబ్బారావుగారు. ఆ వూరికి మకుటం ఒకటి తక్కువైన మహారాజు. ఆ వూళ్ళోనే కాదు ఆ పరగణా మొత్తంపైన ఆయన మాట కోటి వరహాల మూటగా జనం, ప్రభుత్వగణం పరిగణిస్తారు. అది వారి తండ్రి సిద్ధేశ్వరరావుగారు రవి అస్తమించని ఆంగ్ల సామ్రాజ్య కాలంనుంచీ ప్రోదిచేసిన గౌరవమర్యాదల విలువ.

ఆస్తీ, అంతస్థు అన్నీ వున్నాయి. ఏనాడో పట్టా పుచ్చుకున్నా ఉద్యోగం చేయవలసిన అవసరం కంటే ఊళ్లేల వలసిన అగత్యమే వుండటంతో సుబ్బారావుగారు ప్రభుత్వోద్యోగిగా తలవంచి జీవించకుండా ప్రజాసేవకుడిగా తలెత్తి జీవించారు. దేనికి బాధించవలసిన అవసరం లేకుండా వ్యవసాయంలో ఇబ్బడి

ముబ్బడిగా లాభిస్తూ వుండటంతో ఆయన జీవితమంతా నిత్యకళ్యాణం పచ్చతోరణంగా నిత్యనూతనంగా సాగిపోతుంది. పరిమిత సంతానం... సంతానంలో అందరూ చదువూ సంధ్యలు నేర్చినవారే ... చివరి అబ్బాయి శ్రీధర్.

పెద్దవాళ్ళిద్దరూ మంచి చదువులు చదివి పెద్ద ఉద్యోగాలకి వెళ్ళిపోయారు. మారుతున్న కాలాన్ని బట్టి మార్పు చెందుతోన్న చట్టాలనుబట్టి ఉద్యోగాలకి వెళ్తానన్న ఆ ఇద్దర్నీ కాదనలేదు. ఉన్న ఒక్కగానొక్క కూతురు వైజయంతికి చక్కగా చదువు, సంగీతం, నాట్యం నేర్పించి ఈడు జోడైన వరుడ్ని వెదికి వివాహం చేశారు. ఆడవారికి ఎన్నిఉన్నా మనసెరిగినవాడూ, మనసైనవాడూ మమతలు పండించేవాడూ తోడుగా, నీడగా లభించకపోతే ఇక ఆ జీవితం జీవనం వ్యర్థమే అనే సిద్ధాంతాన్ని మనస్ఫూర్తిగా విశ్వసిస్తారాయన. తన జీవితంలో అనుకూలవతిగా షట్కర్మయుక్తా కులధర్మపత్నీ అన్న విధంగా అన్ని విధాలుగా నడుచుకునే జీవన సహచరి సరస్వతి లభించటం తనకెంతగా తృప్తినిచ్చిందో ఆయనకి తెలుసు. తనలాగే తన సంతానమూ సుఖపడాలని ఆయన దృఢ దీక్ష.

ఊళ్ళో అడుగుపెట్టిన వారం రోజుల దాకా ఇన్నాళ్ళూ పరీక్షలకోసం పడిన శ్రమంతా మరిచిపోయేలా విశ్రాంతి తీసుకున్నాడు శ్రీధర్. అతని మనస్సు శరీరం సేదదీరాయి. అన్నీ తొక్కిస పడకుండా లభిస్తే దత్తమండలమైనా ఉదకమండలం లాగా వుంటుంది. లభించని నాడు ఉదకమలడలం అయినా ఉష్ణమండలం లాగే వుంటుంది.

ప్రతిరోజూ తమ తోటలు, దొడ్లూ, పొలాలు తిరిగి తిరిగి చూసి వస్తున్నాడు శ్రీధర్. పచ్చని చేనిగట్లు భూదేవి కట్టుకున్న చీర అంచులాగా నిగనిగలాడే పైరు ఆమె కట్టుకున్న పచ్చని చీరలాగా కనిపించాయి. నిండుగా దండిగా కలకలలాడ్తూ కనిపిస్తోన్న ఆ పంటపొలాలు సస్యలక్ష్మి నిత్య సౌభాగ్యంలా కన్పించాయతనికి.

• • •

ఆ రోజు ఉదయం తండ్రీ కొడుకులిద్దరూ ముఖాముఖి అయ్యారు.

'శ్రీధర్! నీ తర్వాతి కార్యక్రమమేమిటి?' అని ప్రశ్నించారాయన.

ఒక్క క్షణం మౌనం వహించాడు శ్రీధర్.

'ఇంకా చదువుతావా?'

'ఊహూఁ' అన్నాడు తన మనసులోని భావాన్ని స్పష్టపరుస్తూ.

'మరి... న్యాయవాది వవుతావా?'

'ఊహూఁ' ఈ మారు యింకా దృఢంగా చెప్పాడు. తన జీవనమార్గమేదో ఆ వరకే నిర్ణయించుకున్నట్టుగా వుందతని ధోరణి.

ఆ మాటలకి ఆశ్చర్యపోయారాయన. 'చదవక... న్యాయవాద వృత్తి చేపట్టక ...మరింకేం చేయాలని?' ప్రశ్నించారాయన. కొద్దిసేపాగి 'ఉద్యోగం చేస్తావా?' అని అడిగారు లాలనగా. ఇప్పుడా కంఠంలో కొద్దిగా నైరాశ్యం తొంగి చూసింది. తన ప్రియపుత్రుడు ఎక్కడికో వెళ్ళిపోతే ఆ వియోగాన్ని భరించ లేనట్టుగా వుందాయన ధోరణి.

'ఉహూ' నిర్ద్వంద్వంగా అన్నాడు శ్రీధర్.

ఈ పర్యాయం తేలిగ్గా నిట్టూర్చారాయన. ఏదో పెద్ద బరువు తీరిపోయినంత తృప్తి కన్పించిందా నిట్టూర్పులో.

'నేను ఇంటిపట్టున్నే వుంటాను' తండ్రి ప్రశ్నార్థకపు చూపులకి సమాధానించాడు తను.

శ్రీధర్ మాటలు వినగానే ఆయనకెంతో సంతోషమైంది. ప్రేమగా ఆశగా పెంచుకున్న కొబ్బరిచెట్టు తొలి కాపులోనే వందలేసి కాయలు కోసినంత ఆనందం కల్గింది.

'వ్యవసాయం చూస్తూ మీకు చేదోడు వాదోడుగా వుంటాను. మీకు విశ్రాంతి ఇస్తాను' అన్నాడు.


తను జీవన వ్యవసాయంలో పండించిన ఫలాలకు మెచ్చి ఆ భగవంతుడే గొప్ప బిరుదిచ్చినంతగా మురిసిపోయారాయన. కొడుకుని మనసారా కౌగిలించుకున్నారు. తన కలల పంట శ్రీధర్. అన్ని విధాలా తన భావనా ప్రతిరూపంలా వున్నాడు. ఇప్పుడు తన అడుగుజాడే గురుజాడగా భావించుకుంటున్నాడు! ఇంతకంటే ఏ తండ్రికయినా కావలసిం దేముంది? తను సుఖంగా జీవిస్తూ తనతోపాటు నలుగుర్నీ సుఖపెట్ట గలిగేది వ్యవసాయమే! అది అందరికీ భిక్షపెట్టే అన్నపూర్ణ... భారతీయుల అతి ప్రాచీన వృత్తి. దేనికిదే సాటి అనుకున్నారాయన.

◆ ◆ ◆

పంట నూర్పిళ్లకు శ్రీధర్ వస్తూ వుండటం చూసిన కూలిజనం, పల్లెజనం, పాలేరుగణం అంతా ఆశ్చర్యపోయారు. ప్రతి సంవత్సరం అలా వచ్చి ఇలా చూసివెళ్లే చిన్నయ్యగారు ఈ యేడు అన్నీ తనే స్వయంగా పరీక్షించటం వాళ్లకి వింతగా నిష్ఠూరంగా అన్పించింది.

'మీ కెందుకీ శ్రమ చినబాబుగారూ? పెద్ద చదువులు చదువుకున్నారు. హాయిగా ఇంట్లో నీడపట్టున వుండక ఎందుకండీ ఈ యాతన? ఈ ఎండలకు బొగ్గులా నల్ల బడిపోతారు' అన్నాడు పెద్ద పాలేరు.

శ్రీధర్ ఒకసారి తన చేతులవైపు చూసుకున్నాడు. నిజమే! ఈ పదిహేను రోజులకే పట్టణంలో నిగనిగలాడిన తన శరీరం కొద్దిగా వన్నె తగ్గింది. వెంటనే చేయి చూశాడతను. అది నల్ల తాచులా యవ్వన వర్ణంలో నిగనిగ




లాడ్తుంది. నలుపైనా తెలుపైనా అందం అందమే! అది ఆరోగ్యంలో వుంది అనుకుని పాలేరు మాటలకి నవ్వేశాడు.

వరుసగా నెలరోజులు శ్రమిస్తేకానీ పంట నూర్పిళ్ళు పూర్తికాలేదు. ఆ సంవత్సరం శ్రీధర్ తొలిసారిగా తన భూమ్మీద కాలు మోపాడనో యేమో పంట అనుకున్నదానికంటే ఎక్కువగా దిగుబడి వచ్చింది

'చిక్కిపోయావ్. రంగూ తగ్గిపోయావ్!' అంది ఆ రాత్రి పాలమీగడ అన్నం కలిపి పెడుతూ సరస్వతిగారు.

శ్రీధర్ నవ్వేడు. అతని బుగ్గన గుంటలో అదృష్టసుళ్ళు తిరిగినట్లయింది. అందంగా నిగనిగలాడూ గాలికి ఎగిరే ఉంగారాల జుత్తు పెద్దకళ్ళు నున్నని మీసం మొనతేలిన గడ్డం... తండ్రి రూపానికి ప్రతిబింబంలా వుంటాడు శ్రీధర్. కడగొట్టు కుమారుడనే కాదు. యింకా ఎన్నో కారణాలున్నాయి. వాడంటే ఆమెకి పంచప్రాణాలు.

'ఇలా వారం రోజులు వరుసగా నువ్వు కలిపిపెడ్తూ, తినిపిస్తూవుంటే మళ్లీ రంగొస్తుంది' అన్నాడు నవ్వుతూ. అతని చిరునవ్వులో చేమంతులు విరబూస్తాయి. పారిజాతాలు పరిమళిస్తాయి. గులాబీలు గుప్పుమంటాయి.

• • •

పంటనూర్పిళ్లన్నీ అయ్యాక పాలేర్లకు, జీతగాళ్లకూ, కూలీలకు ధాన్యం కొలవటం మొదలయింది. ఇంకో వారంలోనో, పదిరోజుల్లోనో మళ్లీ పొలాలకి ఎరువులు తోలటంతో మళ్లీ కొత్త పనులు మొదలవుతాయి. అందుకే యీ పంటకి సంబంధించిన కూలీలన్నీ కొలిచేస్తున్నారు రావుగారు. అదంతా రెండు రోజులు పట్టింది.

'నువ్వు వ్యవసాయానికి దిగావనేమో ఏటాకన్నా ఈ యేడు దిగుబడి ఎక్కువగా వచ్చింది' అన్నారు రావుగారు,

దానికి సమాధానంగా నవ్వుతూ 'కానీ మనం కూలీలకి పాలేళ్లకీ ఎక్కువేం యివ్వలేదు' అన్నాడు బాధగా శ్రీధర్.

'అందరికంటే మనమే ఎక్కువిస్తాం. అందుకే ఎవరూ మనలని, మన పొలాలనీ విడిచి వెళ్లరు.'

'శ్రమశక్తి వాళ్లది...ఫలితం అంతా మనది."

'పెట్టుబడి మనది, పొలాలు మనవి...' కొడుకు వ్యవహారం వింతగా వుండటంతో యదార్థం చెప్పారాయన.

'కానీ శ్రామికులే లేకపోతే మన పెట్టుబడి వ్యర్థం, మన పొలాలు దండుగే' స్పష్టంగా తన అభిప్రాయం చెప్పాడు శ్రీధర్.

'అదేం మాట... అలా అయితే ఒక్క వ్యవసాయమే ఏమిటి? అన్నీ అంతే... వ్యాపారాలూ... కర్మాగారాలూ...'

'ఏవైతేనేం శ్రమశక్తిని దోచుకునే దివాణాలూ, న్యాయానికి శ్రమశక్తికి తగినవాటా వారికివ్వాలి' తన నిర్ణయం చెప్పాడతను.

'అది మన ఒకరితో అవుతుందా?'

'పిడికిళ్లతో ఇసుక విసుర్తూ వుంటే ఏనాటికయినా— ఎంత అఖాతాన్నయినా పూడవ్వచ్చు-'

'నీ యిష్టం... నేను కాదనేది ఏముంది? భూ పరిమితి చట్టం వచ్చినపుడు మన పొలాలన్నీ నా పేరా, మీ నలుగురి పేరా విడివిడిగా రాశాను. పుట్టింటి అరణం మీ అమ్మ పేరనే వుంది. మీ అన్నయ్యలకి యింత మక్తా అని నిర్ణయించు. అలాగే మీ అక్కయ్యకి, మాకూ నిర్ణయించు, ఆస్తి అంతా నీదే. లాభాలన్నీ సరిసమానంగా పంచినా సరే... అంతా వాళ్లకే ఒదిలేసినా సరే...' ఆయన కంఠంలో కొద్దిగా నిష్ఠూరం ధ్వనించింది. 'కానీ నలుగురితోపాటు నారాయణాగా మనమూ వుండాలి... ఇవి పల్లెటూళ్ళు... మురా రాజకీయాలు ఎత్తుకు పై ఎత్తులు...' అర్ధోక్తిలో ఆగేడతను,

'నేనూ మీలాగే వాటి జోలికి వెళ్లకుండా, అన్నిటికీ అతీతంగా తామరాకుపై నీటిబొట్టులా జీవిస్తాను.'

'నీ యిష్టం మారే కాలంతోపాటు మనుషులూ మారాలి.'

• • •

తమ వ్యవసాయంలో పాల్గొనే పాలేళ్లనీ, జీతగాళ్లనీ పిలుచుకుని పొలాల వైపు వెళ్లాడు శ్రీధర్. అతను తన మనస్సులోని భావాలు చెప్పగానే వాళ్లు పకపకనవ్వారు. 'అయ్యగారూ! మీరింత చదువుకుని యీ మట్టి పిసుక్కునే పనికి దిగుతారా?' అన్నారు. ఆ మాటల్లో ఆ నవ్వుల్లో ఇది మీతో అయ్యేపని కాదన్న ధ్వని విన్పించింది.

కానీ శ్రీధర్ తన నిర్ణయాన్ని మార్చుకోలేదు.



వ్యవసాయంలో దిగిపోయాడు: కూలీలల్లో కూలీగా, పాలేళ్లలో పాలేరుగా శ్రమించాడతను. అతను పనులు ప్రారంభించి పొలాలకి ఎరువులుతోలటం ప్రారంభించిన నాడే వారికి వాటా వేసి చెప్పాడు.

'పంట దిగుబడిలో పెట్టుబడి వాటా పోను మిగిలిన ధాన్యం మూడు భాగాలు చేద్దాం. ఒక వంతు మీకు... ఒక వంతు నాకు... మరోవంతు భూస్వామికి. కష్టపడి సమిష్టిగా కృషిచేయండి, అని చెప్పాడు.

ఆ రాత్రి అందరూ రావుగారి వద్దకు వెళ్లి చినబాబుగారి ఆలోచనలన్నీ చెప్పారు-

'మీరు ఆ ప్రకారంగానే నడవండి. నాకు లాభాలు తగ్గినా ఫర్వాలేదు. మీకు మీ కూలీ గిట్టుబాటయితే చాలు. పంట నాసిగా ఎన్నడూ రాలేదు. ఒకవేళ నష్టం వచ్చి మీకూలీ తగ్గేట్టయితే యధాతధంగా వెనుకటిలాగే ఇస్తాం' అని ధైర్యం చెప్పారాయన.

దాంతో వాళ్లు రెట్టింపు ఉత్సాహంతో వెళ్ళేరు.

• • •

కూలీలకి కమతం వారికి తమది అనే దానిపై కంటే తమ యజమానుల పైనే, వారి ఆస్తులపై ఆదాయాలపైనే ప్రేమానురాగాలు ఎక్కువ. అందుకే తమస్వార్థం మరచిపోయి యాజమాన్యం కోసం ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుంటారు. ఇక అంతా తమదే అనే భావాన్ని మొలకేసి ప్రోదిచేసి పెంపుచేసి ఫలింపజేస్తే......

మొదటి ప్రయత్నమే దిగ్విజయమైంది. పెట్టుబడి, కూలీలు పోగా ఎప్పు

డూ మిగిలేదానికంటే పదిశాతం పంట ఎక్కువగా మిగిలింది.

ధరలు కూడా పెరగటంతో పాలేళ్లకి తమ వాటా కూలీకంటే ఇరవైశాతం ఎక్కువ ఫలం భాగంగా వచ్చింది. ఇందులో ఎవరికీ లాభం తగ్గిపోలేదు, నష్టం రాలేదు.

మరెక్కడ్నుంచి వచ్చాయీ లాభాలు! తన ప్రియతమ పుత్రుడిగా భావించి భూమాత ఎక్కువ ఫలసాయాన్నిచ్చిందా?

అవును. ఎప్పటికంటే పదిశాతం ఫలాన్ని ఎక్కువిచ్చింది.

ఆ రాత్రి రావుగారు శ్రీధర్‌ని మనసారా అభినందించారు.

'నాన్నగారూ! మీరు వ్యవసాయం చేపట్టాక పొలాన్ని నాల్గోవంతు పెంచారు. రెండిళ్లు కట్టారు. మా చదువులు, పెళ్లిళ్లు చేశారు, మిగిలిన సొమ్ము వడ్డీలకిచ్చారు. కానీ తాతగారి కాలంనుంచీ మన పెద్ద పాలేరు అలాగే వున్నాడు. పూరిపాక అలాగే వుంది. పది గజాలయినా ఇంటిస్థలం కొనుక్కోలేదు. ఎవర్నీ చదివించలేదు. ఎకరం పొలం కొనలేదు. డబ్బు కూడబెట్టలేదు. ఎక్కడుంది లోపం? వాళ్ళు ఒళ్ళొంచి పండిస్తే మనం గరిసెలు నింపుకున్నాం. వాళ్ళ గురించి ఏనాడూ ఆలోచించలేదు. వాళ్ళూ కూలీ పెంచమన్నారే తప్ప భాగస్వామ్యం అడగలేదు.'

'నలుగురితోపాటే మనమూ నడిచాం. ఈనాడు నువ్వు కొత్తబాట తొక్కావు. నేను కాదనలేదు. కాదనలేను. మనల్ని చూసి నలుగురూ ఆచరిస్తే యీ దేశం సస్యశ్యామలం...సౌభాగ్యవంతం అవుతుంది.'

చప్పున తండ్రి పాదాలకి అభివందనం చేశాడు శ్రీధర్. నన్నాశీర్వదించండి. మన కుటుంబంతోపాటు పది కుటుంబాలూ పెరిగొస్తాయి.

'విజయోస్తు' అంటూ ఆశీర్వదించి, అభినందనగా కొడుకుని కౌగలించుకున్నారాయన. శ్రీధర్ కళ్ళలో విజయలక్ష్మి నృత్యం చేసింది,